సాక్షి
పార్వతీపురం మన్యం
గురువారం । 15 । జూన్ । 2023



దేశ సేవకు కదలిరా..!

జిల్లాలో వచ్చేనెల జూలై 20 నుంచి త్రివిధ దళాల రిక్రూట్‌మెంట్ ర్యాలీ జరగనుంది. యువత కోసం ఉచిత రెసిడెన్షియల్ శిక్షణ అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది. - 4లో



మనసున్న మహారాజు ముఖ్యమంత్రి

ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి మనసున్న మహారాజు అని కాంట్రాక్టు ఉద్యోగులు పేర్కొన్నారు. సర్వీసు క్రమబద్ధీకరణపై హర్షం వ్యక్తంచేశారు. - 4లో



మహిళ దుర్మరణం

బొండపల్లి మండలం అంబటివలస గ్రామం సమీపంలోని రోళ్లవాక జంక్షన్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి చెందగా, మరో నలుగురు గాయపడ్డారు. - 4లో

న్యూస్‌రీల్

జాబ్‌మేళా రేపు

పార్వతీపురం టౌన్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 16న కురుపాం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జాబ్‌మేళా నిర్వహించనున్నట్టు నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి యు.సాయికుమార్ బుధవారం తెలిపారు. పదోతరగతి, ఇంటర్మీడియట్, పాలిటెక్నిక్ డిప్లొమా, డిగ్రీ ఉత్తీర్ణులైన 18 నుంచి 30 ఏళ్ల మధ్య వయస్కులు జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆ రోజు ఉదయం 9 గంటల నుంచి జరిగే జాబ్ మేళాలలో పది కంపెనీల ప్రతినిధులు పాల్గొని అభ్యర్థులను ఎంపిక చేస్తారన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఏపీఎస్ఎస్‌డీసీ.ఇన్‌వెబ్ సైట్‌లో విధిగా పేర్లు నమోదు చేసుకుని, రిఫరెన్స్‌నంబర్‌తో పాటు రెజ్యూమ్, ఆధార్ కార్డు, విద్యార్హత సర్టిఫికెట్లు ఒరిజినల్ మరియు జెరాక్స్, ఒక పాస్‌ఫొటోతో హాజరు కావాలని కోరారు. మరిన్ని వివరాలకు సెల్: 63034 93720, 89788 78557 నంబర్లను సంప్రదించాలని కోరారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్య

● ఐటీడీఏ పీఓ కల్పనాకుమారి



బద్దుమహసింగి ఆశ్రమ పాఠశాల సిబ్బందితో మాట్లాడుతున్న పీఓ కల్పనాకుమారి

పాలకొండ: విద్యార్థులకు నాణ్యమైన విద్య, ఆహారం అందించాలని సీతంపేట ఐటీడీఏ పీఓ కల్పనాకుమారి ఉపాధ్యాయులకు సూచించారు. మండలంలోని బద్దుమహసింగి గిరిజన ఆశ్రమ పాఠశాలను బుధవారం ఆమె సందర్శించారు. విద్య, భోజనం, వసతి తీరును పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం ఎం.సింగుపురం పీహెచ్‌సీని సందర్శించారు. వైద్య సేవలపై ఆరా తీశారు. సేవలు సక్రమంగా అందడంలేదన్న రోగుల ఫిర్యాదు మేరకు హెడ్‌నర్స్ విజయలక్ష్మికి షోకాజ్ నోటీసు అందించాలని డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓను ఆదేశించారు. డోలమడలో మలేరియా నివారణ చర్యలను పరిశీలించారు. అనంతరం గొట్ట మంగళాపురం గ్రామంలో జగనన్న కాలనీని పరిశీలించి లబ్ధిదారులకు సూచనలు ఇచ్చారు.

కదిలిన యంత్రాంగం

సాక్షి ఎఫెక్ట్...

వీరఘట్టం: వీరఘట్టం, పాలకొండ మండలాల్లో ఉన్న జగన్నాథస్వామి దేవాలయాల భూముల అన్యాక్రాంతం, భూముల కౌలును సరిగా చెల్లించకపోవడంతో ఆలయాల నిర్వహణ భారంగా మారడంపై సాక్షి దినపత్రికలో 'దేవుడా' శీర్షికన బుధవారం ప్రచురించిన కథనానికి రాష్ట్రదేవదాయశాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ స్పందించారు. ఆలయాల్లో ధూపదీపాల పరిస్థితిపై స్థానిక దేవదాయ శాఖ అధికారులతో మాట్లాడారు. భూముల వివరాలపై ఆరా తీశారు. తక్షణమే పూర్తి వివరాలు అందజేయాలని ఆదేశించారు.


సమయపాలన తప్పనిసరి



జేవీకే కిట్ల పంపిణీ తీరుపై విద్యార్థులను ప్రశ్నిస్తున్న డీఈఓ ప్రేమ్‌కుమార్

భామిని: ఉపాధ్యాయులు విధిగా సమయ పాలన పాటించాలని డీఈఓ ఎస్.ప్రేమ్‌కుమార్ సూచించారు. భామిని మండలంలోని బత్తిలి, భామిని ఉన్నత పాఠశాలలు, భామిని కేజీబీవీ, ఎంపీపీ స్కూల్‌ను బుధవారం ఆకస్మికంగా సందర్శించారు. విధులకు ఆలస్యంగా హాజరైన ఉపాధ్యాయులను మందలించారు. జగనన్న విద్యాకానుకల పంపిణీ తీరును విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. విద్యాబోధన ప్రణాళిక అమలుపై ఉపాధ్యాయులకు పలు సూచనలిచ్చారు. ఆయన వెంట హెచ్‌ఎంలు ఆర్.వెంకటరమణ, కె.వెంకటరావు, సీఆర్పీ ఎస్.చిన్నబాబు ఉన్నారు.

రాజాంలో గాలివాన



రాజాం-పాలకొండ రోడ్డుకు అడ్డంగా పడిన చెట్టు

రాజాం సిటీ: రాజాంలో బుధవారం సాయంత్రం ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. రాజాం-పాలకొండ రోడ్డులో భారీ వృక్షం విద్యుత్ తీగెలపై పడడంతో రెండు స్తంభాలు ఒరిగిపోయాయి. సుమారు రెండు గంటల పాటు ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. విద్యుత్‌శాఖ అధికారులు, పోలీసులు చెట్టును స్థానికుల సహాయంతో తొలగించి రాకపోకలను క్రమబద్ధీకరించారు.

మన్యం కొండల్లో..
సెల్‌మోహన్‌రంగా!

- పూర్తిస్థాయి సెల్ నెట్‌వర్క్ జిల్లాగా పార్వతీపురం మన్యం
- కలెక్టర్ నిషాంత్‌కుమార్ చొరవతో కొత్త జిల్లాలో సువర్ణాధ్యాయం
- రూ.135 కోట్లతో డిజిటల్ విప్లవానికి నాంది
- 181 సెల్‌టవర్ల ఏర్పాటు ● గిరిశిఖర ప్రాంతాల్లో పూర్తిస్థాయిలో సెల్‌ఫోన్ సేవలు
- నేడు లాంఛనంగా ప్రారంభించనున్న సీఎం వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి

సాక్షి ప్రతినిధి, విజయనగరం:



నాడు: సెల్ నెట్‌వర్క్ లేక ప్రజలు పడుతున్న ఇబ్బందులకు ఈ చిత్రం ఒక నిదర్శనం మాత్రమే. గిరిశిఖర ప్రాంతంలోని చినగీసాడ గ్రామస్తులకు ప్రభుత్వ సేవలు అందించేందుకు గ్రామ సచివాలయం ఉద్యోగులు నానా ఇబ్బందులు పడేవారు. వైఎస్సార్ బీమా సర్వే కోసం గుమ్మలక్ష్మీపురం మండలంలో ఎక్కడ సెల్‌ఫోన్ సిగ్నల్ ఉందో చూసుకొని అక్కడికి చినగీసాడ వాసులను తీసుకెళ్లి ఆన్‌లైన్ చేయిస్తున్న పాత చిత్రం ఇది.



నేడు: ప్రభుత్వ కృషితో పాచిపెంట మండలంలో గిరిశిఖర ప్రాంతమైన కుంతాంబడేవలసకు సెల్ టవర్ వచ్చింది. ప్రయోగాత్మకంగా నెట్‌వర్క్ సిగ్నల్స్ ప్రారంభించడంతో ఆ గ్రామస్తుల ఆనందానికి అవధుల్లేవు. గ్రామంలో కొత్తగా ఏర్పాటు చేసిన సెల్ టవర్ వద్దకు వచ్చి తమ సెల్‌ఫోన్లు చూపిస్తూ సంతోషం వ్యక్తం చేస్తున్న చిత్రం ఇది. ఈ నెట్‌వర్క్‌తో వారికి మైదాన ప్రాంతం దగ్గరైంది. ప్రభుత్వ సేవలు సత్వరమే అందించేందుకు ఆస్కారం కలిగింది.



గుమ్మలక్ష్మీపురం మండలం పుసాబడిలో ఏర్పాటు చేసిన సెల్ టవర్

డిజిటల్ విప్లవం దేశంలో ప్రారంభమై దాదాపు రెండు దశాబ్దాలు గడిచిపోతోంది. మైదాన ప్రాంతమంతా అన్ని సేవలు సెల్‌ఫోన్‌తోనే పొందుతున్న ఈ రోజుల్లో గిరిశిఖర ఆవాసాల్లోని గిరిజన ప్రజలకు అందని ద్రాక్షగానే ఉన్నాయి. ఇన్నాళ్లకు ఆ లోటు తీరుతోంది. పార్వతీపురం మన్యం జిల్లాలో డిజిటల్ విప్లవానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాంది పలుకుతున్నారు. కొత్త జిల్లాలో నూతనంగా ఏర్పాటుచేసిన సెల్ టవర్ల నెట్‌వర్క్‌ను లాంఛనంగా వర్చువల్ విధానంలో ప్రారంభించనున్నారు. గిరిజన ప్రాంత ప్రజలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ముచ్చటించనున్నారు. ఇందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లను కలెక్టరు నిషాంత్‌కుమార్ ఆధ్వర్యంలో పూర్తి చేశారు.

పార్వతీపురం మన్యం జిల్లాలో ఇప్పటికీ సెల్ నెట్‌వర్క్ లేని గ్రామాలను, గిరిజన ఆవాసాలను గుర్తించేందుకు గత ఏడాది ప్రత్యేక సర్వే నిర్వహించారు. 182 సెల్ టవర్లు ఏర్పాటు చేయడానికి గత ఏడాది ప్రతిపాదించారు. రూ.135 కోట్ల వ్యయంతో ప్రభుత్వం ఈ ప్రాజెక్టును ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. ఒకటి మినహా మిగతా 181 టవర్లు ఏర్పాటుకు మార్గం సుగమమైంది. జియో 75, బీఎస్ఎన్ఎల్ 70, ఎయిర్‌టెల్ 36 టవర్లను జిల్లాలో మారుమూల ప్రాంతాల్లో ఏర్పాటు చేస్తున్నారు. గుమ్మలక్ష్మీపురం మండలంలో 32, కురుపాం మండలంలో 13, పాచిపెంట మండలంలో 12, కొమరాడ మండలంలో 12, సాలూరు మండలంలో ఏడు, జియ్యమ్మవలస మండలంలో మూడు, మక్కువ మండలంలో రెండు టవర్లు నిర్మాణం పూర్తి అయ్యింది. వాటిలో 30 టవర్ల నుంచి నెట్‌వర్క్ పనితీరును ప్రయోగాత్మకంగా పరిశీలించేందుకు ఇప్పటికే సిగ్నల్స్ ప్రారంభించారు. వాటి ఆధారంగా ప్రభుత్వ సేవలు ప్రారంభమయ్యాయి. మిగతా 51 టవర్ల నుంచి కూడా గురువారమే సిగ్నల్స్ మొదలయ్యే అవకాశం ఉంది. మరో 70 టవర్ల ఏర్పాటుకు సివిల్ వర్క్ దాదాపుగా కొలిక్కి వచ్చింది. మిగతా టవర్ల నిర్మాణాలకు అధికారులు చర్యలు చేపట్టారు.

చేరువకానున్న సేవలు...

గిరిశిఖర ప్రాంతాల్లోని ప్రజలు ఇన్నాళ్లూ సెల్ నెట్‌వర్క్ లేక బాహ్య ప్రపంచంతో సంబంధాల్లేని పరిస్థితి. అత్యవసర పరిస్థితుల్లో 108 అంబులెన్స్‌కు సమాచారం ఇవ్వడానికీ ఎంతో ఆలస్యమవుతోంది. 38 గ్రామ సచివాలయాలకు నెట్‌వర్క్ లేక గిరిజన మారుమూల ప్రాంతాల్లో మాత్రం వాటి సేవలు ఆలస్యమయ్యేవి. సిగ్నల్స్ సరిగాలేక మరో 50 గ్రామ సచివాలయాల్లో సేవలకు అంతరాయం ఏర్పడేది. వీటన్నింటినీ అధిగమించేందుకు ప్రభుత్వం సెల్‌ఫోన్ టవర్ల ఏర్పాటుకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది.

ఇన్నాళ్లకు కష్టాలు తీరుతున్నాయి..



మండల కేంద్రానికి సుమారు యాభై కిలోమీటర్ల దూరంలో కొండలపై ఉన్న మా ఏజెన్సీ ప్రాంత ప్రజలకు సెల్ నెట్‌వర్క్ ఇన్నాళ్లూ అందని ద్రాక్షగా ఉంది. ఆ సేవలు మాకు ఇప్పుడు అందుబాటులోకి వస్తుండటంతో సంతోషంగా ఉంది. మా కష్టాలు తీరుతున్నాయి.

– కారంగి లక్ష్మి, గ్రామ సర్పంచ్, గొయిపాక, గుమ్మలక్ష్మీపురం

ఇదొక శుభ పరిణామం



ఇంతవరకూ ఏ ధ్రువపత్రం అవసరమైనా దాదాపు నలభై కిలోమీటర్ల దూరంలోని కురుపాం మండల కేంద్రానికి వెళ్లిరావాల్సి వచ్చేది. ఇప్పుడు ప్రభుత్వం సెల్‌ఫోన్ టవర్లను ఏర్పాటు చేయడంతో ఆ కష్టాలు తొలగాయి. కురుపాం మండలంలోని తూర్పుముఠా ప్రాంతం వైపు ఉన్న నీలకంఠాపురం గ్రామ సచివాలయం ద్వారా ప్రభుత్వ సేవలు అందుతున్నాయి.

– అద్దాకుల మన్మథరావు, గ్రామ సర్పంచ్, నీలకంఠాపురం, కురుపాం మండలం

నీతిఆయోగ్ ప్రశంసలు గర్వకారణం



సెల్‌ఫోన్ సిగ్నల్ రావడంతో ఆనందం వ్యక్తం చేస్తున్న ప్రజలతో కలెక్టర్ నిషాంత్‌కుమార్ (ఫైల్)

కొత్తగా ఏర్పాటైన పార్వతీపురం మన్యం జిల్లాకు సెల్ నెట్‌వర్క్ ఒక వరం అనే చెప్పాలి. దీనిపై నీతిఆయోగ్ ప్రశంసిస్తూ ట్వీట్ చేయడం గర్వకారణం. ఎక్కడికి వెళ్లినా ఫోన్ సిగ్నల్ ఉంటుంది. ప్రతి ఆవాసానికీ 4జీ నెట్‌వర్క్ అందుబాటులోకి వస్తుంది. కొత్తగా దాదాపు 80 వేల మంది ప్రజలకు ప్రయోజనం. ఇక ప్రాంతాల మీదుగా రోజూ సగటున ప్రయాణించే దాదాపు 20 వేల మందికి సెల్‌ఫోన్ సిగ్నల్ సమస్య ఉండదు. అన్ని గ్రామ సచివాలయాలకు పూర్తిస్థాయిలో నెట్‌వర్క్ ఉంటుంది. ప్రభుత్వ సేవలు ప్రజలకు సులభంగా అందుతాయి. మరోవైపు నాటుసారా విక్రయాలు, గంజాయి రవాణాకు అడ్డుకట్ట వేయడానికి, అక్రమ వ్యాపారాలపై పోలీసులకు సమాచారం ఇవ్వడానికి ఆస్కారం ఏర్పడుతోంది.

– నిషాంత్‌కుమార్, పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టరు

సచివాలయంలో సేవలన్నీ చకచకా...



గొయిపాక గ్రామంలో సెల్‌ఫోన్ టవర్ పెట్టారు. టెస్ట్ సిగ్నల్స్ ప్రారంభించారు. నెట్‌వర్క్ ఎంత ఉపయోగపడుతుందో తెలిసింది. గ్రామ సచివాలయానికి వచ్చిన ప్రజలకు పూర్తిస్థాయిలో సేవలు ఇవ్వగలిగాం. ధ్రువపత్రాలన్నీ సకాలంలో అందించాం. స్పందన అర్జీలను ఎప్పటికప్పుడు పరిష్కరించాం. పూర్తిస్థాయిలో సిగ్నల్స్ వస్తే గిరిశిఖర గ్రామాల ప్రజలకు ప్రభుత్వ సేవలు చకచకా అందుతాయి.

–బిడ్డిక ప్రసాద్, పంచాయతీ కార్యదర్శి, గొయిపాక, గుమ్మలక్ష్మీపురం

ఊరూరా ఉత్సవం

ఒక కుటుంబం శుభకార్యానికి సిద్ధమయిందంటే ఆ కుటుంబం ఆనందంగా ఉన్నట్టు లెక్క. ఊరంతా కలిసి గ్రామ దేవతల ఉత్సవాలకు సిద్ధమయ్యారంటే ఊరందరూ బాగున్నారని అర్థం. పంటలు కలిసి రావడం, గిట్టుబాటు ధర చేతికి అందడం.. పిల్లల చదువులు చక్కగా సాగడం.. ఉద్యోగాల్లో స్థిరపడడం...పల్లెలు ప్రగతి పథంలో పయనించడం.. కరోనా మహమ్మారి వంటి విపత్తుల నుంచి క్షేమంగా బయటపడడంతో 60 ఏళ్లు, 40 ఏళ్లు, 20 ఏళ్ల మందు జరుపుకున్న గ్రామదేవత ఉత్సవాలను రెండు నెలలుగా సందడిగా జరుపుకుంటున్నారు. సిరిమానోత్సవాలను సంబరంగా నిర్వహిస్తున్నారు. ఆధ్యాత్మిక చింతనతో గడుపుతున్నారు. ఉమ్మడి విజయనగరం జిల్లాలో ఊరూరా సాగిన, సాగుతున్న ఉత్సవాలకు 'సాక్షి' అక్షర రూపం.



విజయనగరం డెస్క్:

ఊరి పండగ (గ్రామదేవతల) అంటే ఐక్యతకు ప్రతీక. సంస్కృతి సంప్రదాయాలకు నెలవు. విజయనగరం ఉమ్మడి జిల్లాలోని పల్లెల్లో గత రెండు నెలలుగా గ్రామదేవత ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ఏ పల్లెలో చూసినా ఉత్సవ సందడి కనిపిస్తోంది. పల్లెప్రజలందరూ గ్రామ దేవతల పండగలో మమేకమవుతున్నారు. దూర ప్రాంతాల నుంచి స్వగ్రామాలకు చేరుకుని తమ ఇష్టదైవాలకు భక్తిశ్రద్ధలతో పూజలు చేస్తున్నారు. బంధుమిత్రులతో కలిసి ఆనందంగా గడుపుతున్నారు. అన్నసంతర్పణలు చేస్తున్నారు. అందరూ బాగుండాలని.. అందులో మనముండాలని ఆకాంక్షిస్తున్నారు.

దశాబ్దాల తర్వాత...

చాలా గ్రామాల్లో దశాబ్దాల తర్వాత గ్రామదేవతల ఉత్సవాలు నిర్వహించారు. ఏన్నో ఏళ్లుగా నిర్వహించాలని భావిస్తున్నా పరిస్థితులు అనుకూలించేవికావని, ఏదో ఒక అటంకంతో పండగ నిర్ణయం వాయిదా పడేదని, ఇప్పుడు పల్లెల్లో ప్రశాంత వాతావరణం నెలకొనడం... ఆర్థికోన్నతి చెందడం, అడ్డంకులు లేకపోవడంతో గ్రామ పండగలను వైభవంగా నిర్వహిస్తున్నామని గ్రామపెద్దలు చెబుతున్నారు. మనసంస్కృతీ సంప్రదాయాలను భవిష్యత్తు తరాలకు అందజేయాల్సిన బాధ్యత మనపై ఉందని, గ్రామ దేవతలను ఆరాధిస్తే ఊరికి మంచి జరుగుతుందన్న ఉద్దేశంతో నియమనిష్టలతో ఉత్సవాలను జరుపుతున్నట్టు పేర్కొన్నారు. అమ్మవార్లకు ఘటాలతో చల్లదనం చేసి చల్లని ఆశీస్సులు పొందుతున్నామన్నారు.



వీరఘట్టంలో పైడితలమ్మ సిరిమానోత్సవం (ఫైల్)

'చిత్రంలో కనిపిస్తున్నది పార్వతీపురం పట్టణంలో గతనెల 29న జరిగిన గ్రామదేవతల సిరిమానోత్సవం. ఇప్పలపోలమ్మ పండగను 2014 సంవత్సరంలో నిర్వహించారు. మళ్లీ ఇప్పుడు జరుపుకున్నారు. సాంస్కృతి ప్రదర్శనలు, బాజాభజంత్రీలు నడుమ అమ్మవారి సిరిమానోత్సవం, ఘటాల ఊరేగింపును జరిపారు. ఇన్నాళ్ల అన్ని విధాలా పరిస్థితులు అనుకూలించడంతో పండగను వేడుకగా జరుపుకోగలిగామని గ్రామ పెద్దలు తెలిపారు.





64 ఏళ్ల తర్వాత..

చిత్రంలో అసరితల్లి అమ్మవారి పాలజంగిడిలో ఘటాన్ని ఉంచి ఊయల సేవ చేస్తున్నది పాలకొండ మండలంలోని కొండాపురం గ్రామస్తులు. 64 ఏళ్ల తరువాత గ్రామంలో అసిరితల్లి ఉత్సవాలను సంప్రదాయబద్ధంగా, శాస్త్రోక్తంగా జరిపారు. అమ్మవారికి ముర్రాటలు సమర్పించారు. సాంస్కృతిక ప్రదర్శనలు పెద్ద ఎత్తున నిర్వహించారు. ఆరు దశాబ్దాల తర్వాత జరిగిన పండగను ప్రతీ కుటుంబం సంబరంగా జరుపుకుంది.

వైభవంగా..



రాజాం మండలం పెనుబాక గ్రామంలో గత నెల 22 నుంచి 30 వరకు తొమ్మిదిరోజుల పాటు గ్రామ దేవత అసిరితల్లి పండగను వైభవంగా నిర్వహించారు. 14 ఏళ్ల తర్వాత నిర్వహించిన ఉత్సవంలో గ్రామస్తులందరూ మమేకమయ్యారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ముర్రాటలు సమర్పించారు. కోలాటం, శక్తివేషాలు, కోయిడ్యాన్సులు, తప్పెటగుళ్ల ప్రదర్శనలతో అమ్మవారిని కొలిచారు. పరిస్థితులు అనుకూలించడంతో పండగను జరుపుకున్నట్టు పెనుబాక వాసులు తెలిపారు.

అమ్మవారి చల్లని కరుణతో...



కరోనా మహమ్మారి ముప్పు తొలగింది. పట్టణ ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉన్నవేళ... పండగను నిర్వహించాలని నిర్ణయించాం. గత నెల 28, 29, 30 తేదీల్లో పండగను వైభవంగా నిర్వహించాం. అమ్మవారి ఆశీస్సులు అందుకున్నాం. పండగ నిర్వాహణకు ప్రభుత్వం, జిల్లా అధికార యంత్రాంగం పూర్తిస్థాయిలో సహకరించింది.

– జయబాబు, ఇప్పలపోలమ్మ ఉత్సవ కమిటీ సభ్యుడు, పార్వతీపురం

ఉత్సవం.. సంప్రదాయానికి ప్రతీక



గ్రామదేవత ఉత్సవం ఆ ఊరి సంప్రదాయానికి ప్రతీక. గ్రామ దేవతలను పూజిస్తే మంచి జరుగుతుందన్నది నమ్మకం. పరిస్థితులు అనుకూలించకపోవడంతో పండగను తొమ్మిదేళ్ల తర్వాత నిర్వహించగలిగాం. సిరిమాను అధిరోహించి అమ్మవారి ఆశీస్సులు భక్తులకు అందించిన వేళ కలిగే ఆనందం వర్ణించలేనిది.

– నక్కల శ్రీనువాసరావు, సిరిమాను పూజారి, ఎర్రకంచమ్మ ఆలయం, జగన్నాథపురం

పూర్వజన్మ సుకృతం



ఎన్నో ఏళ్లుగా సిరిమానును మా కుటుంబ సభ్యులు అధిరోహించడం ఎన్నో జన్మల అదృష్టంగా భావిస్తున్నాను. వివిధ ఆటంకాలతో పండగను ఏళ్లతరబడి నిర్వహించకపోవడంతో సిరిమానును అధిరోహించలేదు. ప్రస్తుతం ప్రజలంతా ఆనందంగా, సుఖసంతోషాలతో ఉండడంతో గ్రామ పెద్దలు పండగను జరపడానికి నిర్ణయించారు. దీంతో ఈ ఏడాది సిరిమానును అధిరోహించాను.

– ఆరికి రాజారావు, సిరిమాను పూజారి, ఇప్పలపోలమ్మ ఆలయం

పార్వతీపురం మన్యం జిల్లాలో ఇటీవల జరిగిన గ్రామదేవత ఉత్సవాలు ఇలా..

- పార్వతీపురం జగన్నాథపురం గ్రామ దేవత ఎర్ర కంచమ్మ పండగను ఏడేళ్ల తర్వాత నిర్వహించారు.
- పార్వతీపురం బెలగాం గ్రామదేవతైన బంగారమ్మ తల్లి పండగను కూడా ఏడేళ్ల తర్వాత గత నెలలో భక్తి శ్రద్ధలతో జరిపారు.
- 2012లో నిర్వహించిన సీతానగరం మండలం పెదబోగిల గ్రామదేవతైన బోగితల్లిని భక్తిశ్రద్ధలతో పూజించారు.
- సీతానగరం మండలం దయానిధి పురం గ్రామంలో ఏడేళ్ల కిందట నిర్వహించిన పైడితల్లి అమ్మవారి ఉత్సవాలను 2023 ఏప్రిల్ నెలలో నిర్వహించారు.
- పాలకొండ మండలం పొట్లి గ్రామంలో 50 ఏళ్ల తరువాత బంగారమ్మ గ్రామ దేవత ఉత్సవాలను అంగరంగ వైభంగా 11 రోజుల పాటు నిర్వహించారు.
- వీరఘట్టం గ్రామ దేవత అయిన పైడితల్లమ్మ ఉత్సవాలను ఏడేళ్ల తరువాత భక్తి శ్రద్ధలతో వైభవంగా మే నెలలో నిర్వహించారు.



ఏర్పాట్ల పరిశీలన



శిఖలబాయిలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ నిషాంత్‌కుమార్

గుమ్మలక్ష్మీపురం/కురుపాం/పార్వతీపురం: పార్వతీపురం మన్యం జిల్లాలో నిర్మించిన మొబైల్ టవర్లను ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్ రెడ్డి గురువారం వర్చువల్ విధానంలో ప్రారంభించనున్నారు. ఈ నేపథ్యంలో గుమ్మలక్ష్మీపురం మండలంలోని కుక్కిడి పంచాయతీ శిఖలబాయి, కురుపాం మండలంలోని సాయిరాం ఆలయం వద్ద, పాచిపెంట మండలం కుంటుంబడేవలసలో జిల్లా యంత్రాంగం ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. వీటిని కలెక్టర్ నిషాంత్‌కుమార్, పాలకొండ సబ్ కలెక్టర్లు హేమలత, నూరుల్ కమర్, డీఎస్పీ జి.వి.కృష్ణారావు, తహసీల్దార్లు జె.రాములమ్మ, ఆర్.రమేష్ కుమార్, ఎల్విన్‌పేట సీఐ సత్యనారాయణ, ఎస్సై ప్రసాద్, రెవెన్యూ సిబ్బంది బుధవారం పరిశీలించారు. ముఖ్యమంత్రి స్థానిక ప్రజలతో వర్చువల్ విధానంలో ముఖాముఖి నిర్వహించనున్న దృష్ట్యా అనువుగా ఎల్ఈడీ స్క్రీన్ ఏర్పాటుకు సూచనలు చేశారు. ప్రజలు అధిక సంఖ్యలో హాజరయ్యే అవకాశం ఉన్నందున టెంట్లు, కుర్చీలు, మంచినీటి సౌకర్యం కల్పించాలని డీఆర్‌డీఏ పీడీ పి.కిరణ్‌కుమార్‌కు సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సాల్మన్‌రాజు, ఆర్ఐ తిరుపతిరావు, సర్పంచ్ బిడ్డిక రాజారావు పాల్గొన్నారు.

లింగనిర్ధారణ చట్టరీత్యా నేరం

● డీఎంహెచ్ఓ బి.జగన్నాథరావు

పార్వతీపురంటౌన్: లింగ నిర్ధారణ చట్టరీత్యా నేరమని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ బి.జగన్నాథరావు అన్నారు. పార్వతీపురం మున్సిపల్ కార్యాలయంలో గర్భస్థ పిండ లింగ నిర్ధారణ చట్టంపై సచివాలయ సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు, డ్వాక్రా మహిళలు, వలంటీర్లకు బుధవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. పుట్టబోయే బిడ్డ ఎదుగుదల, ఆరోగ్య సమస్యలు తెలుసుకునేందుకు మాత్రమే పరీక్షలు చేయాలని, స్కానింగ్ సెంటర్లలో లింగ నిర్ధారణ చేయడం నేరమని, ఆడా, మగా అని అడిగిన వారు, ప్రోత్సహించిన వారు, చెప్పిన వైద్యులు శిక్షార్హులని తెలిపారు. లింగ నిర్ధారణకు పాల్పడిన వారిపై 104 టోల్ నంబర్, సీపీపీఎన్డీటీ ఆన్‌లైన్ ద్వారా, జిల్లా వైద్య ఆరోగ్య కార్యాలయానికి ఫిర్యాదు చెయొచ్చన్నారు. పిల్లలను సమభావంతో చదివించాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జె.రామ అప్పలనాయుడు డీఐఓ డాక్టర్ టి.జగన్‌మోహన్‌రావు, డాక్టర్ దక్షయ్, డాక్టర్ కుమార్, సన్యాసిరావు, యోగేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

క్లుప్తంగా

సర్పంచ్‌పై దాడి

జామి: మండలంలోని చింతాడ గ్రామానికి చెందిన సర్పంచ్‌పై దాడి జరిగినట్లు పోలీసులకు అందిన ఫిర్యాదు మేరకు కేసు నమోదైంది. వివరాలిలా ఉన్నాయి. గ్రామంలో నువ్వు పంట ఒక వ్యక్తి దొంగతనం చేశాడన్న బాధితుడి అభియోగం మేరకు సర్పంచ్ ఎ.సుబ్రహ్మణ్యం, గ్రామపెద్దలఆధ్వర్యంలో పంచాయితీ చేస్తున్న సమయంలో అదే గ్రామానికి చెందిన టీడీపీ వర్గీయుడు ద్వారపూడి బాలాజీ సర్పంచ్‌పై కత్తితో దాడి చేయబోయాడు. ఈ క్రమంలో సర్పంచ్‌కు రక్షణగా ఉన్న కిలారి వెంకటరమణ గాయపడినట్లు ఫిర్యాదులో పేర్కొన్నట్లు పోలీసులు వివరించారు.

జనరేటర్ చోరీ

బలిజిపేట: మండలకేంద్రంలోని స్టేట్‌బ్యాంక్ జనరేటర్ మంగళవారం రాత్రి చోరీకి గురైంది. దాని ఖరీదు సుమారు రూ.7వేలు ఉంటుందని, పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు స్టేట్ బ్యాంక్ మేనేజర్ చెప్పారు.

రెండు ఇసుక ట్రాక్టర్ల సీజ్

సంతకవిటి: మండలంలోని నాగావళి నది నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను సీజ్ చేశామని ఎస్ఈబీ ఎస్సై పిచ్చేశ్వర రావు తెలిపారు. మంగళవారం అర్ధరాత్రి మల్లయ్యపేట మీదుగా ఇసుకను తరలిస్తున్నారన్న విషయం తెలుసుకుని దాడిచేసి పట్టుకుని సంతకవిటి పోలీస్‌స్టేషన్‌కు ట్రాక్టర్లను అప్పగించగా కేసు నమోదుచేశారని తెలిపారు.

'బంగారు తల్లి'కి అభినందనలు



వెయిట్ లిఫ్టర్ నానిని అభినందిస్తున్న జెడ్పీటీసీ సన్యాసి నాయుడు

నెల్లిమర్ల రూరల్: ఉత్తరప్రదేశ్‌లోని నోయిడాలో ఇటీవల జరిగిన ఖేలో ఇండియా యూనివర్సిటీ వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో స్వర్ణ పతకం సాధించిన గరికిపేట గ్రామానికి చెందిన వెయిట్ లిఫ్టర్ బెల్లాన నానికి అభినందనలు వెల్లువెత్తాయి. ఈ మేరకు కొండవెలగాడ గ్రామంలో ఆర్టీసీ జోనల్ చైర్‌పర్సన్ గదల బంగారమ్మ, జెడ్పీటీసీ సభ్యుడు గదల సన్యాసినాయుడు నానికి బుధవారం అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జాతీయ స్థాయి పోటీల్లో బంగారు పతకం సాధించడం గొప్ప విషయమని ప్రశంసించారు. రానున్న రోజుల్లో మరిన్ని పతకాలు సాధించి గ్రామానికి, జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. వెయిట్ లిఫ్టింగ్‌లో ప్రతిభ కనబర్చిన వారంతా ప్రస్తుతం మంచి స్థాయిలో స్థిరపడ్డారని వారిని ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో చంద్రంపేట వైఎస్సార్‌సీపీ నేతలు కర్రోతు వెంకటరమణ, వాళ్లె అప్పలనాయుడు, కోచ్ బూసరి రవి పాల్గొన్నారు.

జాతీయ తైక్వాండో పోటీల్లో జిల్లాకు పతకాలు



జాతీయ తైక్వాండో పోటీల్లో పతకాలు సాధించిన క్రీడాకారులను సత్కరిస్తున్న దృశ్యం

విజయనగరం: జాతీయస్థాయిలో జరిగిన తైక్వాండో పోటీల్లో జిల్లాకు చెందిన ఇద్దరు క్రీడాకారులు సత్తా చాటారు. ఈనెల 8వ తేదీ నుంచి 11వ తేదీ వరకు ఉత్తరాఖండ్ రాష్ట్రంలోని డెహ్రాడూన్‌లో జరిగిన 38వ సీనియర్ తైక్వాండో చాంపియన్ షిప్‌లో గగన్ సాగర్ సిల్వర్ మెడల్, వై.భార్గవి బ్రాంజ్ మెడల్ కైవసం చేసుకున్నారు. జాతీయ స్థాయి సీనియర్స్ తైక్వాండో చాంపియన్ షిప్‌లో మొట్టమొదటి సారిగా జిల్లా నుంచి మెడల్ సాధించినవారుగా వారిద్దరూ గుర్తింపు పొందారు. ఈ సందర్భంగా ఆ క్రీడాకారులను జిల్లా ఒలింపిక్స్ అసోసియేషన్, తైక్వాండో అసోసియేషన్ ప్రతినిధులు బుధవారం ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు గురాన అయ్యలు, సీహెచ్ వేణుగోపాలరావు, కోశాధికారి అవనాపు విక్రమ్, ఉష్షు జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు జి.శ్రీనివాస్, సెపక్‌తక్రా అసోసియేషన్ అధ్యక్షుడు రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు	(100 గుడ్లు)
విశాఖపట్నం	రూ. 515.00
విజయనగరం	రూ. 519.00
శ్రీకాకుళం	రూ. 519.00

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24సి. 10గ్రా.)	60,450-00
బంగారం(22సి. 10గ్రా.)	55,400-00
వెండి (కిలో)	79,300-00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹165	₹300	₹ 310

దేశ సేవకు కదలిరా..!

- త్రివిధ దళాల రిక్రూట్‌మెంట్‌కు ఉచిత శిక్షణ
- ఉమ్మడి జిల్లా యువత సద్వినియోగం చేసుకోవాలి
- డిప్యూటీ స్పీకర్, జెడ్పీ చైర్మన్ విజ్ఞప్తి



రెసిడెన్షియల్ శిక్షణ వివరాలు వెల్లడిస్తున్న సెట్విజ్ సీఈఓ రామ్‌గోపాల్

విజయనగరం: జిల్లాలో వచ్చేనెల జూలై 20 నుంచి త్రివిధ దళాల రిక్రూట్‌మెంట్ ర్యాలీ నిర్వహిస్తున్న నేపథ్యంలో ఉమ్మడి విజయనగరం జిల్లా యువత కోసం ఉచిత రెసిడెన్షియల్ శిక్షణ అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాట్లు చేసిందని, దీనిని రెండు జిల్లాలకు చెందిన యువత సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర శాసనసభ ఉప సభాపతి కోలగట్ల వీరభద్రస్వామి, జిల్లాపరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాస రావు కోరారు. భారతీయ నౌకాదళం, వాయుసేన, ఆర్మీలో పనిచేసేందుకు అర్హులైన అభ్యర్థుల ఎంపికకోసం జరిగే శారీరక, రాతపరీక్షల్లో రెండు జిల్లాల యువత అధికంగా అవకాశాలు పొందేందుకు వీలుగా నిపుణులైన కోచ్‌లు, రిటైర్డ్ ఆర్మీ అధికారులు, ఉపాధ్యాయులతో శిక్షణ ఇచ్చేందుకు జిల్లా యువజన సర్వీసుల శాఖ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు. సెట్విజ్, శాప్ ఆధ్వర్యంలో నగరంలోని రాజీవ్ ఇండోర్ స్టేడియంలో నిర్వహిస్తున్న ఉచిత ఆర్మీ రిక్రూట్‌మెంట్ శిక్షణ శిబిరాన్ని వారు బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పార్వతీపురం మన్యం, విజయనగరం జిల్లాలకు చెందిన 17-23 సంవత్సరాల మధ్య గల యువత ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీలో పాల్గొనే ఆసక్తి ఉన్నట్లయితే జిల్లా కేంద్రంలో ఇస్తున్న శిక్షణలో చేరాలని సూచించారు. నలభై రోజుల పాటు శారీరక దారుఢ్యంలో, రాతపరీక్షలో అవసరమైన శిక్షణ ఇచ్చేందుకు ఏర్పాట్లు చేశారని, రిక్రూట్‌మెంట్ జరిగే రోజు వరకు శిక్షణ ఇవ్వనున్నారని తెలిపారు. జూన్ 20 నుంచి ఇక్కడ పూర్తిస్థాయి శిక్షణ ప్రారంభమవుతుందని, ఈలోగా రెండు జిల్లాల అభ్యర్థులు శిక్షణ శిబిరంలో చేరేందుకు పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

విజయనగరంలో రిక్రూట్‌మెంట్ ర్యాలీ

విజయనగరం జిల్లా కేంద్రంలో జూలై 20 నుంచి ఆగస్టు 2వ తేదీ వరకు రిక్రూట్‌మెంట్ ర్యాలీ నిర్వహిస్తున్నారని, ఈ ర్యాలీలో మన ప్రాంత యువతీ యువకులు పెద్దసంఖ్యలో అవకాశాలు పొందాలనే లక్ష్యంతో ప్రోత్సహిస్తున్నట్లు చెప్పారు. జిల్లాపరిషత్ నుంచి ఉచిత శిక్షణ శిబిరం నిర్వహణకు రూ.5 లక్షలు, జిల్లా యంత్రాంగం నుంచి మరో రూ.3 లక్షలు కేటాయించినట్లు చెప్పారు.

పోలీస్ శిక్షణ కేంద్రంలో ర్యాలీ ఏర్పాట్లు

శ్రీకాకుళం నుంచి ఎన్టీఆర్ జిల్లా వరకు 13 జిల్లాలకు చెందిన యువతీ యువకులు ఈ ర్యాలీకి హాజరు కానున్నారని, పోలీసు శిక్షణ కేంద్రంలో ఈ ర్యాలీ నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని సెట్విజ్ సీఈఓ రాంగోపాల్ చెప్పారు. జూన్ 20 నుంచి రిక్రూట్‌మెంట్ ర్యాలీ జరిగే వరకు ఈ శిక్షణ ఉంటుందన్నారు. అభ్యర్థులందరికీ ఉచితంగా భోజన, వసతి సౌకర్యం కల్పిస్తున్నామని తెలిపారు. పోలీసు శిక్షణ కళాశాలకు చెందిన పలువురు నిపుణులైన అధికారులు, రిటైర్డ్ ఆర్మీ అధికారులు శారీరక దారుఢ్యం పెంపొందించడంపై శిక్షణ ఇస్తారని, పలువురు నిపుణులైన ఉపాధ్యాయులు రాతపరీక్ష అంశాలపై శిక్షణ ఇస్తారని చెప్పారు. 15 వేల మంది రిక్రూట్‌మెంట్ ర్యాలీకి దరఖాస్తు చేసుకున్నారని, వారికి రాతపరీక్ష నిర్వహించి అందులో ఎంపికైన 10 వేల మందికి శారీరక దారుఢ్య పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు.శిక్షణ శిబిరంలో పేర్లు నమోదు చేసుకోదలచిన అభ్యర్థులు సెట్విజ్ సీఈఓ మొబైల్ నంబర్ 9849909080కు ఫోన్ చేసి శిబిరంలో చేరవచ్చని సూచించారు. రాజీవ్ స్టేడియంలోని తమ కార్యాలయంలో కూడా పేర్లు నమోదు చేసుకోవచ్చన్నారు. జిల్లా సైనిక సంక్షేమ అధికారి మజ్జి కృష్ణారావు మాట్లాడుతూ సైనిక దళాల ఎంపికపై తగిన అవగాహన కల్పిస్తే మన ప్రాంత యువత ఎక్కువగా ఎంపికయ్యే అవకాశం ఉంటుందన్నారు. త్రివిధ దళాల్లో పనిచేసిన వారికి ప్రభుత్వం మంచి సౌకర్యాలు కల్పిస్తున్నందున వాటిలో చేరేందుకు యువత ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో పోలీసు శిక్షణ కేంద్రం అధికారి మురళి, నగర మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

నీట్ ఫలితాల్లో బాలికల ప్రతిభ



నిహారిక నాయుడు, మాధవి, కాపరోతు ఉషాశ్రీ, రెడ్డి తేజశ్విని, నేహ



రౌతు జ్యోత్స్న, తేలు సాయికిరణ్, పూడి సంజయ్‌కుమార్, పల్లికల లక్ష్మీ అనూహ్య, వంగపండు సంతోషిణి

విజయనగరం ఫోర్ట్: తాజాగా విడుదలైన నీట్ ఫలితాల్లో జిల్లాలోని పలువురు బాలికలు ప్రతిభ చాటారు. ఈ మేరకు జాతీయ స్థాయి ప్రవేశ పరీక్షల్లో ర్యాంకులు సాధించిన వారి వివరాలిలా ఉన్నాయి, విజయనగరం పట్టణానికి చెందిన ముర్రు నిహారిక నాయుడు 720 మార్కులకు గాను 700 మార్కులు సాధించడంతో ఆలిండియాలో 255వ ర్యాంక్ వచ్చింది. నిహారిక నాయుడు తల్లిదండ్రులు వైద్యులు. తండ్రి ముర్రు జయచంద్ర నాయుడు సొంతంగా జేసీ స్కాన్ నిర్వహిస్తున్నారు. ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడిగా కూడా ఉన్నారు. తల్లి ఇందిరకు సొంతంగా క్లినిక్ ఉంది. ఏపీఈఏపీసెట్‌లో కూడా నిహారిక నాయుడు (అగ్రికల్చర్) విభాగంలో 105 ర్యాంక్ సాధించింది.

మాధవికి 665 మార్కులు

గజపతినగరం: మండలంలోని పురిటిపెంట న్యూకాలనీలో నివాసం ఉంటున్న వెన్నెలవేను మాధవి నీట్ ఎంట్రన్స్ టెస్ట్‌లో 665 మార్కులు సాధించి 3,603వ ర్యాంకు పొందింది. సెంట్రల్ లిస్ట్ ఓబీసీ కేటగిరీలో 1,157వ ర్యాంకు సాధించింది. విశాఖలోని ప్రైవేట్ కళాశాలలో చదువుతున్న మాధవి నీట్‌లో ప్రతిభ కనభరచడంతో తల్లిదండ్రులు వెంకటరమణ, పూర్ణిమలతో పాటు స్థానికులు అభినందించారు.

చీపురుపల్లి: చీపురుపల్లి పట్టణానికి చెందిన ఇద్దరు బాలికలు ప్రతిభ కనబరిచారు. పట్టణంలోని కొత్తగవిడివీధికి చెందిన కాపరోతు ఉషాశ్రీ 720 మార్కులకు గాను 561 మార్కులు సాధించింది. దీంతో ఆలిండియా స్థాయిలో 55,129 ర్యాంక్‌ను, ఈడబ్ల్యూఎస్ కేటగిరిలో 7,510వ ర్యాంక్‌ను దక్కించుకుంది. ఉషాశ్రీ తండ్రి మురళీధర్ పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో పీఈటీగా పని చేస్తుండగా తల్లి సునీత గృహిణి. అలాగే చీపురుపల్లి మేజర్ పంచాయతీ పరిధిలోని రెడ్డిపేట గ్రామానికి చెందిన రెడ్డి తేజశ్విని 720 మార్కులకు గాను 538 మార్కులు సాధించింది. దీంతో ఆలిండియా స్థాయిలో ఓబీసీ కేటగిరీలో 33,552 ర్యాంక్ దక్కించుకుంది. పదో తరగతి వరకు పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలోనే చదువుకున్న తేజశ్విని తండ్రి లక్ష్మణరావు వ్యాపారవేత్త కాగా తల్లి హేమలత గృహిణి.



జీవన్ శృతి

కోటిపాం విద్యార్థినికి 595 మార్కులు

కొమరాడ: మండలంలోని కోటిపాం గ్రామానికి చెందిన పాపల శ్రీనునాయుడు కుమార్తె నేహ నీట్ ఫలితాల్లో 595వ మార్కులు సాధించి ప్రతిభ కనబరిచింది. ఈ సందర్భంగా ఆమెకు కుటుంబసభ్యులు, ఉపాధ్యాయులు అభినందనలు తెలియజేశారు.

బొబ్బిలి విద్యార్థులు..

బొబ్బిలి: మున్సిపాలిటీలోని గొల్లపల్లిలో నివాసముంటున్న దామోదరరావు కుమార్తె రౌతు జ్యోత్స్న నీట్ పరీక్షలో ఆలిండియాలో 11,145 వ ర్యాంకు సాధించింది. ఆమె ఏపీఎంసెట్‌లో 430, తెలంగాణ ఎంసెట్‌లో 435వ ర్యాంకు సాధించింది. అలాగే సీతానగరం మండలంలో ఉంటున్న (బొబ్బిలి నివాసి) తేలు సాయికిరణ్ ఆలిండియాలో 9,996వ ర్యాంకు, ఓబీసీలో 3,250 ర్యాంకు సాధించాడు. సాయికిరణ్ తండ్రి మధుసూదన రావు ఎల్ఐసీ ఏజెంట్. తల్లి గృహిణి. బాడంగి మండలం వాడాడకు చెందిన పూడి సంజయ్‌కుమార్ ఆలిండియాలో 11,825వ ర్యాంకు సాధించాడు. బొబ్బిలిలో నివాసముంటున్న పల్లికల లక్ష్మీ అనూహ్య ఎస్సీ కేటగిరీలో 131, ఆలిండియాలో 5,407 ర్యాంకు సాధించింది. ఆమె తల్లిదండ్రులు వరప్రసాదరావు, ప్రసన్నలక్ష్మి ఉపాధ్యాయ వృత్తిలో ఉన్నారు. అలాగే బాడంగి మండలం మల్లంపేటకు చెందిన వంగపండు సంతోషిణి ఆలిండియాలో 592వ ర్యాంకు, ఓబీసీలో 134 వ ర్యాంకు పొందింది. ఆమె తండ్రి వంగపండు అప్పారావు భోగాపురం జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తుండగా తల్లి భవాని గృహిణి.

గరుగుబిల్లి: మండలంలోని ఉల్లిభద్ర గ్రామానికి చెందిన అక్కపోలు జీవన్ శృతి నీట్‌లో 720కు 618 మార్కులు సంపాదించి జాతీయస్థాయిలో 19,117, ఓబీసీ కేటగిరిలో 8,027 ర్యాంకు, లోకల్‌లో 329 ర్యాంకు సాధించింది. ఆమె తండ్రి శంకరనాయుడు బట్టల వ్యాపారి.

మనసున్న మహారాజు ముఖ్యమంత్రి



ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేసిన జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, రెగ్యులరైజ్ అయిన కాంట్రాక్ట్ ఉద్యోగులు

- జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

విజయనగరం గంటస్తంభం: ఈ రాష్ట్రాన్ని అనేకమంది ముఖ్యమంత్రులు పరిపాలించారు. ఇప్పటివరకు ఏ ఒక్క ముఖ్యమంత్రీ చేయని విధంగా కాంట్రాక్ట్ ఉద్యోగస్తులను రెగ్యులరైజ్ చేస్తూ క్యాబినెట్‌లో తీసుకున్న నిర్ణయం చూస్తుంటే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మనసున్న మహారాజు అని స్పష్టంగా తెలుస్తోందని జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాస రావు అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు పదివేల మందికి పైగా కాంట్రాక్ట్ ఉద్యోగస్తులను రెగ్యులరైజ్ చేసిన ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలుపుతూ రెగ్యులరైజ్ అయిన కాంట్రాక్ట్ ఉద్యోగులందరికీ జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అభినందనలు తెలిపారు. ఇటీవలే కాంట్రాక్ట్ ఉద్యోగస్తులను రెగ్యులరైజ్ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం మేరకు బుధవారం జిల్లా పరిషత్ కార్యాలయంలో విజయనగరం జిల్లా కాంట్రాక్ట్ ఉద్యోగస్తులు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేస్తూ ఆయన చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అనంతరం కేక్ కట్ చేసి వారి ఆనందాన్ని వ్యక్తపరిచి జిల్లా పరిషత్ కార్యాలయం నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాస రావు మాట్లాడుతూ రెగ్యులరైజ్ అవకాశం కలిగిన ప్రతి ఒక్క ఉద్యోగీ ముఖ్యమంత్రికి, ఈ ప్రభుత్వానికి ఎప్పుడు అండగా ఉండాలని కోరారు.

భర్త వేధింపులు



చికిత్స పొందుతున్న శ్రావణి

పార్వతీపురం: అదనపు కట్నం కోసం భర్త తన భార్యను వేధిస్తున్న సంఘటన పార్వతీపురం పట్టణంలో వెలుగుచూసింది. ఈ మేరకు పార్వతీపురం ఆస్పత్రి అవుట్‌పోస్ట్ పోలీసులు బుధవారం తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పార్వతీపురం పట్టణానికి చెందిన గుడ్ల శ్రావణికి రవితేజతో వివాహమై తొమ్మిదినెలలవుతోంది. వివాహ సమయంలో 14తులాల బంగారం రెండు లక్షల నగదు, పెండ్లి కుమారుడికి బ్రాస్‌లెట్ శ్రావణి తల్లిదండ్రులు ఇచ్చారు. వివాహమైన తరువాత భార్యభర్తలు హైదరాబాద్‌లోని అన్నాజిగూడలో అద్దెకు ఉండేవారు. భర్త రవితేజ అదనపు కట్నం తేవాలని, నిత్యం భార్యను హింసించేవాడు. ఈ విషయం పెద్దల సమక్షంలో రెండుసార్లు చర్చలు జరిపి రాజీ చేశారు. అయినా భర్తలో ఎలాంటి మార్పు రాలేదు. ఇటీవల మళ్లీ భార్యను కొట్టి హింసించేవాడు. ఈ క్రమంలో మనస్తాపం చెందిన ఆమె హైదరాబాద్‌నుంచి పార్వతీపురం కన్నవారింటికి వచ్చి తీవ్ర అనారోగ్యం కారణంగా పార్వతీపురం జిల్లా ఆస్పత్రిలో చికిత్స కోసం చేరింది.

చీపురుపల్లిలో 'శతకోటి దండాలు' సందడి



హీరో షకలక శంకర్, హీరోయిన్ జిప్సిలపై క్లాప్ కొడుతున్న డీఎస్పీ చక్రవర్తి

చీపురుపల్లి: కేఏఆర్ ఫిల్మ్, వీఎస్ఆర్ మూవీస్ ప్రెజెంట్స్ నేతృత్వంలో తెరకెక్కనున్న 'శతకోటి దండాలు' సినిమా షూటింగ్‌తో చీపురుపల్లిలో సందడి నెలకొంది. పట్టణంలోని ఆంజనేయపురంలో గల శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో సినిమా షూటింగ్ ముహూర్తపు పూజ బుధవారం నిర్వహించారు. ప్రముఖ కమెడియన్ షకలక శంకర్, జిప్సి హీరో హీరోయిన్లుగా నటిస్తున్న ఈ సినిమాకు చీపురుపల్లి డీఎస్పీ చక్రవర్తి క్లాప్ కొట్టారు. హీరో, హీరోయిన్లపై తొలి సన్నివేశాన్ని ఆలయంలో చిత్రీకరించారు. జబర్దస్త్ కమెడియన్ అప్పారావు, కోఆర్టిస్టులు గీతాసింగ్, ప్రియ నటిస్తున్న ఈ చిత్రాన్ని చీపురుపల్లి పరిసరాల్లో నెల రోజుల పాటు చిత్రీకరించనున్నట్లు దర్శక, నిర్మాతలు శ్రీ ముత్యమ్, విజనగిరి శ్రీనివాసరావులు తెలిపారు. పట్టణంలో సినిమా షూటింగ్ జరుగుతున్నట్లు తెలుసుకున్న ప్రేక్షకులు పెద్ద ఎత్తున అక్కడికి చేరుకుని షకలక శంకర్, అప్పారావులతో ఫొటోలు దిగారు.

అన్ని దానాల కన్నా రక్తదానం మిన్న

- డీఎంహెచ్ఓ డాక్టర్ భాస్కరరావు



రక్తదాత చిరంజీవికి మెమెంటో, ప్రశంసాపత్రం అందజేస్తున్న ప్రభుత్వ వైద్యకళాశాల ప్రిన్సిపాల్ పద్మలీల ఆస్పత్రి సూపరింటెండెంట్

విజయనగరం ఫోర్ట్: అన్ని దానాల కన్నా రక్తదానం గొప్పదని డీఎంహెచ్ఓ డాక్టర్ ఎస్.భాస్కరరావు పేర్కొన్నారు. ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా స్థానిక ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి రక్తనిధి కేంద్రంలో బుధవారం ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రక్తదానం వల్ల మాత్రమే ప్రాణాలు కాపాడవచ్చని, ఆరోగ్యవంతులైన ప్రతి ఒక్కరూ ఏడాదికి నాలుగు సార్లు రక్తదానం చేయవచ్చని హితవు పలికారు. రక్తదానం చేయడం వల్ల ఎటువంటి అనారోగ్య సమస్యలు రావని స్పష్టం చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో రక్తదానంపై అవగాహన కల్పించాలని కోరారు. జిల్లాలో రక్తం కొరత లేకుండా ప్రతి ఒక్కరూ పాటు పడాలని పిలుపునిచ్చారు. రక్తదానం చేయడమంటే ఆపదలో ఉన్న సాటిమనిషికి పునర్జన్మ ప్రసాదించడమేనన్నారు. అనంతరం ఆస్పత్రి సమావేశ మందిరంలో జరిగిన కార్యక్రమంలో రక్తదాతలకు, రక్తదాన శిబిరం నిర్వాహకులకు మెమెంటోలు, ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.పద్మలీల, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శంబంగి అప్పలనాయుడు, ఆర్ఎంఓ డాక్టర్ సురేష్‌కుమార్, డీఎల్ఓ డాక్టర్ ఎస్.సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

బైక్ ప్రమాదంలో ముగ్గురికి గాయాలు



చికిత్సపొందుతున్న క్షతగాత్రులు

పార్వతీపురం: కొమరాడ మండల కేంద్రానికి చెందిన ఏగోటి కృష్ణ గుమడ గ్రామం నుంచి కొమరాడకు నడుచుకుంటూ వెళ్తుండగా కోటిపాం నుంచి కొమరాడ వస్తున్న ద్విచక్రవాహనం ఢీకొంది. దీంతో జరిగిన ప్రమాదంలో కృష్ణతో పాటు బైక్‌పై వస్తున్న ఇద్దరు వ్యక్తులు గాయాలపాలయ్యారు. ఈ మేరకు చికిత్సకోసం 108 వాహనంలో క్షతగాత్రులను పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి తరలించారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

పార్వతీపురం: తాగుడు మానేయాలని భార్య మందలించడంతో మనస్తాపం చెందిన భర్త ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డాడు. సీతానగరం మండలం తామరఖండి గ్రామంలో జరిగిన ఈ సంఘటన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన ద్వారపురెడ్డి సత్యనారాయణ కూలిపనులు చేసిన డబ్బులు ఇంటికి ఇవ్వకుండా రోజూ తాగుతూ ఉంటాడు. ఎప్పటిలాగానే తప్పతాగి బుధవారం ఇంటికి వచ్చిన భర్త సత్యనారాయణను పిల్లల గురించి పట్టించుకోకుండా తప్పతాగి ఇంటికి వస్తే ఒప్పుకోనని, తాగితే ఇంటిగడప తొక్కవద్దని భార్య రూప మందలించింది. దీంతో మనస్తాపం చెందిన సత్యనారాయణ ఇంటి నుంచి బయటికి వెళ్లి పొలాలకు వేసే పురుగుమందు తాగేశాడు. ఈ సమాచారం తెలుసుకున్న భార్య గ్రామస్తుల సాయంతో 108 ద్వారా పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి తీసుకురాగా వైద్యులు చికిత్స అందిస్తున్నారు. ఈ సంఘటనపై ఆస్పత్రి అవుట్‌పోస్ట్ పోలీసులు కేసు నమోదు చేశారు.

మహిళ దుర్మరణం

- మరో నలుగురికి తీవ్ర గాయాలు
- కారు, బస్సు ఢీకొనడంతో ప్రమాదం



ప్రమాదంలో మృతిచెందిన రాజేశ్వరి (పచ్చచీర కట్టుకున్న మహిళ)

బొండపల్లి: మండలంలోని అంబటివలస గ్రామం సమీపంలో రోళ్లవాక జంక్షన్ వద్ద జాతీయ రహదారిపై బుధవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక మహిళ ప్రమాద స్థలంలోనే మృతి చెందగా, మరో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. ఈ సంఘటనకు సంబంధించి ఎస్సై ఎస్.రవి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. సాలూరు పట్టణానికి చెందిన నలుగురు మహిళలతో పాటు ఒక వ్యక్తి సాలూరు నుంచి విజయనగరం కారులో వస్తుండగా విశాఖపట్నం నుంచి పార్వతీపురం వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో కారు పూర్తిగా నుజ్జునుజ్జయింది. కారులో ప్రయాణిస్తున్న సాలూరులోని గొల్లవీధికి చెందిన మారుతి రాజేశ్వరి(60) అక్కడిక్కడే మృతి చెందింది. అదే కారులో ప్రయాణిస్తున్న మీసాల లక్ష్మి, కాకి పార్వతి, మారుతి కల్యాణ చక్రవర్తితో పాటు మరో మహిళ తీవ్రంగా గాయపడ్డారు. క్షతగ్రాతులను 108 వాహనంలో విజయనగరంలోని సర్వజన కేంద్రాస్పత్రికి తరలించారు. సంఘటనా స్థలాన్ని గజపతినగరం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎల్.అప్పలనాయుడు పరిశీలించి, ప్రమాద వివరాలు తెలుసుకున్నారు.



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

గుర్తు తెలియని వ్యక్తి..

విజయనగరం క్రైమ్: స్థానిక బాలాజీ జంక్షన్ సమీపంలో పెద్దచెరువు గట్టు మీద గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందినట్లు వన్‌టౌన్ పోలీసులు బుధవారం తెలిపారు. సుమారు 50 నుంచి 60 ఏళ్ల మధ్య వయసు గల వ్యక్తి మృతదేహం గురించి సమీపంలో విచారణ చేయగా యాచక వృత్తి చేస్తూ జీవనం సాగించేవాడని స్థానికులు చెప్పారు. మృతదేహాన్ని జిల్లా కేంద్రాస్పత్రికి తరలించామని, కుటుంబ సభ్యులు, బంధువులు ఎవరైనా గుర్తిస్తే పోలీసులను సంప్రదించాలని వన్‌టౌన్ సీఐ బి.వెంకటరావు కోరారు.

గ్రామ స్థాయిలోనే రిజిస్ట్రేషన్ సేవలు



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ నిషాంత్‌కుమార్ తదితరులు

పార్వతీపురం: రీ సర్వే పూర్తయిన గ్రామాల్లో రిజిస్ట్రేషన్ సేవలను అందించాలని సీఎం జగన్‌మోహన్ రెడ్డి కలెక్టర్లను ఆదేశించారు. ఈ మేరకు బుధవారం కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లు, పోలీసు సూపరింటెండెంట్‌లతో ప్రభుత్వ పథకాలపై సీఎం జగన్ మోహన్ రెడ్డి తన కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో సమీక్షించారు. ఈ సందర్భంగా జగనన్నకు చెబుదాం, గడప గడపకు మన ప్రభుత్వం, ఉపాధిహామీ పథకం, జగనన్న గృహపథకం, వ్యవసాయం, జగనన్న భూహక్కు-భూరక్ష పథకాల పురోగతిపై తెలుసుకున్నారు. ఈ నెల 23వ తేదీనుంచి జగనన్న సురక్ష పథకాన్ని ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఈ సమీక్షలో పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ నిషాంత్ కుమార్, జేసీ ఆర్.గోవిందరావు, ఎస్పీ విక్రాంత్‌పాటిల్, పీఆర్ ఇంజినీరింగ్ అధికారి కృష్ణాజీ తదితరులు ఉన్నారు.